అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




పేదలకు ఆహార భద్రత రేషన్ కార్డు ఎంతో కీలకం

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -122 బుధవారం 23 జూలై 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మాకు ఏది అవసరమో అదే చేస్తాం

: ఈయూ ఆంక్షలపై భారత్ స్పందన
రష్యా నుంచి క్రూడ్ దిగుమతి చేసుకుంటున్న భారత్
ఇటీవలే అమెరికా హెచ్చరిక
ఇప్పుడు అదే బాటలో యూరోపియన్ యూనియన్
జాతీయ ప్రయోజనాలే ముఖ్యమన్న భారత్



2లో.

## నకిలీ ఓటర్లను తొలగించడం కోసమే

ఎస్ఐఆర్‌పై వివరణ ఇచ్చిన ఎన్నికల సంఘం
ఎస్ఐఆర్ నకిలీ ఓటర్లను జాబితా నుంచి తొలగించడం కోసమేనన్న ఈసీ
సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన ఈసీ
ఎస్ఐఆర్‌ను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా చిత్రీకరిస్తున్నాయన్న ఈసీ



2లో.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై వెనకడుగు లేదు...!!



ఎలాటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం
అవసరమైతే న్యాయపోరాటినికి కూడా వెనకాడం
కేంద్రం దీనిని వెంటనే ఆమోదించి చిత్తశుద్ధి చాటాలి
రామచంద్రరావు లీగల్ నోటీసులకు జడిసేది లేదు
మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,**జులై22(జర్నలిస్ట్ వార్త)**:బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లలో వెనక్కి పోయే ప్రసక్తి లేదని అన్నారు. కులగణన అవసరం లేదని భాజపా మొదట మాట్లాడింది. తెలంగాణ ప్రభుత్వం, రాహుల్ గాంధీ ఒత్తిడితో జనగణనలో కులగణన చేరుస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తాం. కులగణనను క్యాబినెట్‌లో, శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాం. అసెంబ్లీలో మిగతాది 2లో..

# ధన్‌ఖడ్ స్థానంలో ఎవరు..?

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌పై దృష్టి
బీహార్ ఎన్నికల నేపథ్యంలో కలసివచ్చే ఛాన్స్
ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ,**జులై22(జర్నలిస్ట్ వార్త)**:
ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. ఆయన రాజీనామా వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ధన్ ఖడ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సంతకం చేసి లేఖను హోంశాఖకు పంపించారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగా చైర్మన్ హోదాలో జగదీప్ ధన్ ఖడ్ రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు.తొలిరోజు కార్యకలాపాలు ముగిసి సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత ధన్ ఖడ్ తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.మిగతాది 2లో...



## రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం

ఢిల్లీకి వెళ్లడంలో అర్ధ సెంచరీ సాధించారన్న కవిత
బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం



## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేరాలి

లక్ష్యలు నెరవేరేలా కలెక్టర్లు కృషి చేయాలి
పథకాల ఫలితాలు అందేలా క్షేత్రస్థాయి చర్యలు
వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు మంత్రుల ఆదేశం

హైదరాబాద**జులై22(జర్నలిస్ట్ వార్త)**:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా మిగతాది 2లో...





2లో.

## తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

## ఫోన్ ట్యాపింగ్ కేసు సిబిఐకి అప్పగించాలి

మంత్రుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి
బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్



## దద్దరిల్లిన పార్లమెంట్


బీహార్‌లోని ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల ఆందోళన
ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు
రెండోరోజూ వాయిదాల పర్వం..
ఉభయ సభలు నేటికి వాయిదా



న్యూఢిల్లీ **జులై22(జర్నలిస్ట్ వార్త)**:
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా రెండోరోజూ ఎలాంటి చర్చ లేకుండా సాగాయి. బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్) పేరుతో ఓటర్ల జాబితాను సవరిస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు మంగళవారం ఆందోళన చేపట్టాయి. లోక్‌సభలో, రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ మిగతాది 2లో..

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్,**జులై22(జర్నలిస్ట్ వార్త)**:
తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఫలితాలు రిలీజ్ అయ్యాయి. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా సచివాలయంలో ఫలితాలను విడుదల చేశారు. జూన్ 18 నుంచి 30వ తేదీల మధ్య ఆన్‌లైన్ మోడ్‌లో పరీక్షలు జరిగాయి. టెట్ పరీక్షకు మొత్తం 1,37,429 మంది హాజరయ్యారు. కాగా, కేవలం 33.98 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 30,649 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.



# మాకు ఏది అవసరమో అదే చేస్తాం

## : ఈయూ ఆంక్షలపై భారత్ స్పందన

**న్యూఢిల్లీ,జులై22(జర్నలిస్ట్ వార్త):**
యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షలు మరియు పాశ్చాత్య దేశాల ఒత్తిడి ఉన్నప్పటికీ, రష్యా నుంచి చమురు దిగుమతులపై భారతదేశం తన వైఖరిని స్పష్టం చేసింది. భారతదేశం తన ఇంధన భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ నొక్కిచెప్పారు. ప్రజలకు ఇంధన భద్రత కల్పించాలనే భారతదేశ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు, ముఖ్యంగా యూరోపియన్ భద్రతా సంక్షోభం నేపథ్యంలో ప్రపంచ ఇంధన మార్కెట్లో ద్వంద్వ ప్రమాణాలకు వ్యతిరేకంగా హెచ్చరించారు. మాకు ఏది అవసరమో అది చేస్తాం అని మిస్రీ స్పష్టం చేశారు.
రష్యా నుంచి ముడిచమురును శుద్ధి చేసి, దాన్నుంచి వచ్చిన ఇంధనాలను, జెట్ ఫ్యూయల్ ను యూరప్‌కు ఎగుమతి చేసే భారత్, టర్కీ, యూఏఈ వంటి దేశాలపై యూరోపియన్ యూనియన్ విధించిన కొత్త ఆంక్షలు ప్రభావం చూపుతాయని అంచనా. ఇప్పటికే, భారతదేశం నుంచి యూరప్ దేశాలకు పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులలో గణనీయమైన తగ్గుదల నమోదైంది.
ఇటీవల అమెరికా కూడా రష్యా చమురును దిగుమతి చేసుకుంటే తీవ్ర ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని భారతదేశం, చైనా, బ్రెజిల్ వంటి దేశాలను హెచ్చరించింది. ఈ పరిణామాలు భారతదేశం తన ఇంధన అవసరాలను తీర్చడానికి రష్యా చమురుపై ఆధారపడటం కొనసాగిస్తుందని స్పష్టం చేసింది. జాతీయ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత అని తన వైఖరిని పునరుద్ఘాటించింది.

# నకిలీ ఓటర్లను తొలగించడం కోసమే

## ఎస్ఐఆర్‌పై వివరణ ఇచ్చిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,జులై22(జర్నలిస్ట్ వార్త):**
నకిలీ ఓటర్లను జాబితా నుంచి తొలగించడమే లక్ష్యంగా ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టామని, దీనివల్ల ఓటర్లకు ఎలాంటి నష్టం ఉండదని ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో ఈసీ కౌంటర్ దాఖలు చేసింది.
సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై నిన్న ఈసీ కౌంటర్ దాఖలు చేసింది. బీజేపీ, దాని మిత్రపక్షాలకు లబ్ధి చేకూరే విధంగా బీహార్ ఓటర్ల జాబితాలో మార్పులు చేశారన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఈసీ మరోమారు తోసిపుచ్చింది. ఈసీ తన రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తిస్తోందని తెలిపింది. అయితే, కొన్ని మీడియా సంస్థలు మాత్రం ఎస్ఐఆర్?ను తప్పుగా చిత్రీకరిస్తున్నాయని సుప్రీంకోర్టు దృష్టికి ఈసీ తీసుకొచ్చింది.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఎస్ఐఆర్?ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.అయితే, ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడీ కార్డును పరిగణలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈసీని అనుమానించడానికి ఏమీ లేదని, ఈ అంశంపై మరింత విచారణ జరగాల్సి ఉన్నందున విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది.

# తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

## భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ

హైదరాబాద్ **జులై22(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంతో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న తెలిపారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు.

# దద్దరిల్లిన పార్లమెంట్

**(మొదటి పేజి తరువాయి)**
సింగ్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వినిపించుకోలేదు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాల హోరెత్తించారు. దీంతో ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్షాల సభ్యుల ఆందోళనతో ఉభయసభలు తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదాపడ్డాయి. ఆ తరువాత పునఃప్రారంభమైనప్పటికీ పరిస్థితుల్లో ఏం మార్పు రాలేదు. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు వాయిదాపడ్డాయి. తిరిగి ప్రారంభమైన సభల్లో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో ఉభయసభలు నేటికి వాయిదా పడ్డాయి.ఖ
పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన
బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీల నేతలు పార్లమెంట్‌లో ఆందోళన చేపట్టారు. మంగళవారం పార్లమెంట్ ఉభయ సభల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదురుగా ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీల నేతలు ప్లకార్డులు చేబూని ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాల హోరె త్తించారు. ప్రభుత్వ రివ్యూ ఉద్దేశం, చట్టబద్ధ తను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందో ళనలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎస్పి నేత అఖిలేష్ యాదవ్, డీఎంకె నేతలు కనిమొళి, టిఆర్ బాలు, ఎ.రాజా, ఆర్జేడీ ఎంపీలు మీసా భారతి, మనోజ్ కుమార్ ఝా, సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, రాధాకృష్ణన్ తదితర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. అంతకుముందు రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధ్యక్షతన ఇండియా బ్లాక్ పార్టీల నేతల సమావేశం జరిగింది. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.

# రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం

## ఢిల్లీకి వెళ్లడంలో అర్ధ సెంచరీ సాధించారన్న కవిత
## బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం

**జులై22(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఈ రోజు కూడా ఢిల్లీకి వెళుతున్నారని, దేశ రాజధానికి వెళ్లడంలో ఆయన ఇప్పటికే అర్ధ సెంచరీ సాధించారని వ్యంగ్యం ప్రదర్శించారు. ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గట్టిగా మాట్లాడాలని సూచించారు.హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదని తెలిపారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను వారు కోరుకుంటున్నారని తెలిపారు. రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ బిడ్డలు వారిని వదిలి పెట్టరని హెచ్చరించారు.బీసీ రిజర్వేషన్ల అంశంపై రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతున్న మాటలు బాధాకరమని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి గతంలోనే పంపించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగులో పెట్టి తిరిగి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
బిల్లుకు మతపరమైన రంగు పులిమి బీజేపీ బిల్లును పాస్ చేయడం లేదని విమర్శించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసని, తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ మరో రకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తోందని కవిత వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి న్యాయస్థానాల పరిధిలో ఉందని సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీ బిడ్డలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

# ధన్‌ఖడ్ స్థానంలో ఎవరు..?

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన రాజీనామా లేఖను సమర్పించారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతిని కోరారు. కాగా, ఉపరాష్ట్రపతితో పాటు పలు పదవులు నిర్వర్తించిన జగదీప్ ధన్ ఖడ్ దేశానికి ఎంతో సేవలందించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత ప్రధాని మోదీ ఈ మేరకు ట్వీట్ చేశారు.
ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేండ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీచేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. ఈనేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు– తెలుస్తున్నది. బీజేపీతోపాటు– ఎన్డీయే పక్షాలకు చెందిన నేతనూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈ నేపథ్యంలో జనతాదళ్ (యునై–టెడ్) ఎంపీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. త్వరలో బీహార్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన హరివంశ్‌ను ఇందుకు ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. రాజకీయంగా అ అవకాశాన్ని మోడీ ఉపయోగించుకునే తీరుతారని అంటున్నారు. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాలలో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పీజీ చేసియన ఆయన జర్నలిజ్యంలో డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలా ఏండ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్ ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

# శాటిలైట్ సర్వే ద్వారా పంట వివరాలు...!!

**(మొదటి పేజీ తరువాయి)**
మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్‌లోనూ మద్దతు తెలపాలి. ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందుకెళ్తాం అని అన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందకెళ్తామని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని, అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్లో కూడా పోరాటం చేయాలని కోరారు. ఈ బిల్లు త్వరగా ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆయన చెప్పిన మాట ప్రకారమే రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కుల గణన నిర్వహించామని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో కులగణన అంశం తెరపైకి రావడంలో తెలంగాణ రాష్ట్రానిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన చేసిన తర్వాతే దీనిపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైందన్నారు. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని అందుకే తెలంగాణను చూసి కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని ప్రకటించిందన్నారు. తెలంగాణ జరిగిన విధానమే రేపు దేశవ్యాప్తంగా అమలు కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన, జనగణన చేయడానికి ఇంకా చాలా సమయం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏవైనా న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కొవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.భారత రాష్ట్ర సమితి ప్రజలను మభ్యపెట్టింది. అందరూ అలాగే చేస్తారని ఆ పార్టీ నేతలు అనుకుంటున్నారేమో. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాం. అందుకే తెలంగాణను చూసి కేంద్రం కూడా కులగణనను ప్రకటించిందని భట్టి అన్నారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు బీసీలంటే చిన్నచూపు ఉన్నట్లుంది. ఆయన పంపిన లీగల్ నోటీసులకు ఎలా సమాధానం చెప్పాలో నాకు తెలుసు. నోటీ–సులకు భయపడేది లేదని కౌంటర్ ఇచ్చారు. నోటీసులు అందిన తరువాత ఏవిధంగా సమాధానం చెప్పాలో తనకు తెలుసన్నారు. రామచందర్ రావుకి దళితులన్నా బడుగు బహీన వర్గాలన్నా చిన్న చూపని విమర్శించారు. రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకోవడానికి రామచందర్ రావు కూడా కారణమంటూ ఇటీవల భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రివార్డుగా బీజేపీ అధిష్టానం ఆయనకు తెలంగాణ చీఫ్ పదవి ఇచ్చిందని ఆరోపించారు. రామచందర్ రావుకు తెలంగాణ చీఫ్ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం ఒకసారి పునరాలోచించాలని భట్టి అన్నారు. భట్టి వ్యాఖ్యలను తప్పుబట్టిన రామచందర్ రావు తన న్యాయవాదితో లీగల్ నోటీ–సులు పంపించారు. మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేకపోతే రూ.25 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని రామచందర్ రావు నోటీ–సుల్లో హెచ్చరించారు. దీనిపై క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని సూచించారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేరాలి

**(మొదటి పేజీ తరువాయి)**
తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు,కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి తదితరులు మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని,క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణం సాంఘిక, బిసి, మైనారిటీ– సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమారులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు– చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హు÷లైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో
లబ్ధిదారుడినికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమ్మో÷నై దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యకార్యదర్శులు నదీమ్, ఎన్. శ్రీధర్, దానకిషోర్, నవీన్‌మిట్టల్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్‌కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, విపి గౌతమ్, పిసిసిఎఫ్ సువర్ణ, ఇ.శ్రీధర్, సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నందీశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం





**ఐనవోలు/జులై22(జర్నలిస్ట్ వార్త):**
ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానము నందు బహుళ త్రయోదశి సందర్భంగా మంగళవారం ప్రదోషకాలం లో శ్రీ నందీశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఏక కాలం లో శ్రీ స్వామి వారికి, నందీశ్వరునికి హారతి ఇవ్వడం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తం శర్మ,విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, సాయి, భక్తులు అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



# దుక్కి దున్నిన ఎస్సై

**జనగామ జిల్లా/జులై22(జర్నలిస్ట్ వార్త):** పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో రెండో ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న లింగారెడ్డి తనలో ఉన్న రైతును బయటకు తీసి ఉద్యోగ నిర్వహణలో గూడూరు వెళ్లి పాలకుర్తి పోలీస్ స్టేషన్ కు తిరిగి వెళుతున్న క్రమంలో మార్గ మధ్యలో ఒక రైతు తన పత్తి చేనులో ఎద్దులతో అరక దున్నడం చూసి ఉద్యోగం రాకముందు తాను కూడా ఒక రైతుని అని, నేను కూడా వ్యవసాయం చేశాను అని, రైతు దుక్కి దున్నడం చూసి నాలో ఉత్సాహం వచ్చి గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఎద్దులతో పత్తి చేనులో దుక్కి దున్నారు. ఈ సంఘటన చూసిన ఆ రైతు ఎస్ఐ లింగారెడ్డి చలక దున్నడం చూసి మీకు కూడా ఈ ఇలాంటి పనులు వస్తాయా సార్ అని ఎస్సై లింగారెడ్డిని మెచ్చుకున్నారు.




# వైద్యం వికటించి మహిళ మృతి

**ఖమ్మం బ్యూరో/జూలై22(జర్నలిస్ట్ వార్త):** నగరంలోని శ్రీ సాయి మారుతి ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత వద్ద పరిస్థితి నెలకొంది.గత రెండు రోజుల క్రితం ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన పడిశాల సుభద్ర (38) కిడ్నీలో రాళ్ళు ఉన్నాయని ఆసుపత్రిలో చేరింది.వైద్య పరీక్షలు నిర్వహించి స్టంట్ వేయాలని చెప్పిన వైద్యులు సుభద్రకు ,ఆపరేషన్ చేసారు.వైద్యం వికటించటం తో మహిళ మృతి చెందింది బంధువులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని కొండాపురం గ్రామానికి పంపించారు.దింతో మృతురాలి బంధువులుఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.,పరిస్థితి ఉద్రిక్తం కావటంతో ఆసుపత్రి వద్దకు పోలీస్ లు చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని శాంతింప చేసారు. జరిగిన ఘటన పై వివరాలు సేకరించారు.




## అడవులను సృష్టించి పర్యావరణాన్ని కాపాడుకుందాం




**సత్తుపల్లి/జూలై22(జర్నలిస్ట్ వార్త):** అడవులను సృష్టించి పర్యావరణాన్ని కాపాడు కుందామని సత్తుపల్లి సబ్ జైల్ సూపరింటెండెంట్ ఉబ్బల కుటుంబరాజు అన్నారు. మంగళవారం డీ జి సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు ఖైదీలతో 2వేల సీడ్ బాల్స్ తయారు చేసి వాటిలో విత్తనాలు ఉంచి అడవులు, అర్బన్ పార్క్ లో వేశమన్నారు. ముఖ్యంగా వేప,చింత,సీతాఫలం,మద్ది విత్తనాలు చల్లామని అడవులు సంరక్షించి భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని పంచుదామని, అదేవిధంగా సమాజ అభివృద్ధి లో యువత భాగస్వామ్యం అవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు.ద

## ఆదివాసీ గూడెంలో అన్నం పొట్లాల పంపిణీ

### దానధర్మా ట్రస్ట్ చైర్మన్ గంటా రాధా



**మణుగూరు/జులై22(జర్నలిస్ట్ వార్త):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని విజయనగరం వద్ద ఉన్న ఆదివాసీ గూడెం పెద్దపల్లి లో దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సేవా కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్ గంటా రాధా స్వయంగా చేపట్టి, గూడెంలో ఉన్న పేద కుటుంబాలకు అన్నపొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంటా రాధా మాట్లాడుతూ, ఇది సేవ కాదు, నా బాధ్యత అన్నారు.ఆమె తన స్వంత ఖర్చులతో చేసిన ఈ కార్యక్రమం గూడెంలో ఉన్న పెద్దలూ, చిన్నవాళ్లూ ఎంతో కృతజ్ఞతతో స్వీకరించారు.ఆకలితో ఉండే చిన్నారులకు ఒక్క పూట అన్నం దొరికిన సంతోషం వారి ముఖాల్లో కనిపించింది.ఇప్పటికే దానధర్మ ట్రస్ట్ ద్వారా మణుగూరు ప్రాంతంలో పలుచోట్ల ఈ తరహా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. పేదలు ఆకలితో ఉండకూడదన్న తపనతో గంటా రాధా ఈ పనిని తాను ఎక్కడా ఆపకుండా కొనసాగిస్తానని స్పష్టం చేశారు.ఒక పూట భోజనంతో కుటుంబాలకు కొంత ఉపశమనం కలుగుతుందని భావించిన ఆమె, ఆ గ్రామానికి పయనమయ్యారు. ఈ కార్యక్రమాన్ని చూసిన గ్రామస్తులు, “ఇలాంటి సేవలు చేయడానికి కూడా మనసు కావాలి. ఇది నిజమైన మానవత్వం అంటూ ఆమెను అభినందించారు.సేవే నిజమైన ధర్మమని నమ్మే గంటా రాధా చేస్తున్న పని ఈరోజు ఎంతో మందికి ఆదర్శంగా మారుతోంది..

## తల్లాడ లో వనమహోత్సవ కార్యక్రమానికి స్థల పరిశీలన



**తల్లాడ/జూలై22(జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలం తల్లాడ మేజర్ పంచాయతీ లో వన మహోత్సవానికి అవసరమైన స్థలాన్ని తల్లాడ, కొత్తగూడెం రోడ్డు లో ఉన్న సప్తగిరి వెంచర్ నందు ఎంపీడీవో సురేష్ బాబు మంగళవారం పరిశీలించారు. మొక్కలు నాటడానికి అనుకూలంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ ఎంపీడీవో ఏనుగు సురేష్ బాబు తో పాటు ఈజియస్ ఏపీఓ కోటయ్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, సప్తగిరి వెంచర్ ప్రొప్రైటర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవు





### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**భూపాలపల్లి/జూలై22(జర్నలిస్ట్ వార్త):**
రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.
మంగళవారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎస్ రామ కృష్ణా రావు, ఇతర కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ భారతి
దరఖాస్తుల తిరస్కారానికి సరైన కారణాలు చూపాలన్నారు.ఆగస్టు 15 నాటికి అన్ని దరఖాస్తులు పరిష్కరించాలన్నారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏసమస్యా రాకూడదని స్పష్టం చేశారు. లబ్దిదారులకు దగ్గరలోని రీచ్ ల నుండి ఉచిత ఇసుక ఇవ్వాలని పేర్కొన్నారు.
తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పకడ్బందీగా అమలు చేయాల్సిన బాద్యత జిల్లా కలెక్టర్లదేనని మంత్రి స్పష్టం చేశారు. భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసినప్పుడే దాని ఫలితాలు సామాన్యులకు అందుతాయని అన్నారు. మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సామాన్యులను ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని, సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయని ఇందులో ప్రధానంగా సాదాబైనామా, సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్ , అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్ కు సంబంధించి సుమారు 6 లక్షల దరఖాస్తులు వచ్చాయని వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్టు 15వ తేదీలోగా పరిష్కరించాలన్నారు. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్దం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్ల్యాండ్, లబ్దిదారుల వివరాలను ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు.
దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టం వచ్చిన రీతిలో తిరస్కరించకూడదని, తిరస్కారానికి గల కారణాలను లిఖిత పూర్వకంగా స్పష్టంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్దాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.
ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిపీవోలకు , జె ఎన్ టి యు ఆధ్వర్యంలో లైసెన్స్ డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేసి పరీక్ష సజావుగా నిర్వహించాలన్నారు.
ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పేదవానికి ఏ సమస్య రాకూడదు పేదవాని సొంతింటి కల నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మెస్త్రి ధరలు, చెల్లింపులు, ఇసుక, సిమెంట్, ఇనుము విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏలాంటి సమస్య రాకుండా చూడాలని తెలిపారు. అలాగే ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని , ఇది సరైన విధంగా లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలో ఇసుక అందేవిధంగా చూడాలన్నారు. బేస్మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబాటులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్దిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్య కాదని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలన్నారు.
రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్ధికంగా ఎన్ని ఇబ్బందులున్నా కూడా ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని అయితే సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని ఇటువంటి సమస్యలను గుర్తించి లబ్దిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రెండు పడక గదుల ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ
గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనం, విద్య అందించేందుకు కృషి చేయాలని అన్నారు విద్యార్థుల బాగోగులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్లు పరిశీలించాలని తెలిపారు.వంట గదులను శుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల తల్లి దండ్రులలో పాజిటివ్ నెస్ వచ్చే విధముగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచి భోజనం , మంచి విద్య , పరిశుభ్రత ఉంటుందని తల్లిదండ్రులు నమ్మే విధంగా వసతి గృహాలు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి సలహాలు సూచనలు తీసుకోవాలని అన్నారు. నెలలో ఒక్క హాలిడే రోజు జిల్లా కలెక్టర్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించాలని తెలిపారు.ఒక మంచి వాతావరణాన్ని గురుకుల పాఠశాల లలో కల్పించాలని సూచించారు. ఉచిత బస్సు పథకం ప్రయాణం ద్వారా 2 కోట్ల మంది ప్రయాణించారని అన్ని బస్ డిపోలల్లో వేడుకలు చేయాలని తెలిపారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ

విద్యార్థుల ఆహార సమస్యలు పై ఎక్కడో ఒక్కచోట సమస్య తలెత్తుతుందిని,
డైట్ సప్లయర్ లతో జిల్లా కలెక్టర్లు సమావేశం నిర్వహించాలని తెలిపారు. పప్పులు కూరగాయలు, మాంసం లాంటి వాటిని తనిఖీలు
పక్కాగా చేస్తూ నాణ్యత పాటించేలా చూడాలని అన్నారు. వంటశాలలో స్టీల్ పాత్రలను వాడేవిధంగా చూడాలని, ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడుతుందని ప్రభుత్వ లక్ష్యం మేర పని చేయాలని తెలిపారు. మెడికల్ డిపార్ట్మెంట్ ద్వారా కచ్చితంగా నెలలో ఒక్కసారి మెడికల్ క్యాంపు లు నిర్వహించాలని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ జిల్లా కలెక్టర్లు గురుకుల పాఠశాలలలో నిరంతర తనికీలు చేపట్టాలన్నారు. ఆగస్టు. మొదటి వారంలో దివ్యాన్ గులకు ఉపకరణాలు పంపిణీ ముఖ్యమంత్రి చేయనున్నారని జిలాల్లో ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ
మొక్కలు నాటు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలన్నారు. అర్బన్ పార్కు లను అభివృద్ధి చేయాలని తెలిపారు. వన మహోత్సవంలో పెద్ద మొక్కలు నాటాలని తెలిపారు. గత సంవత్సరం 95 శాతం లక్ష్యాన్ని సాధించామని ఈ సంవత్సరం నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని శాఖల అధికారులు లక్ష్యం మేర మొక్కలు నాటాలని, మొక్కల లెక్కలు పక్కాగా ఉండేందుకు జియా ట్యాగింగ్ చేయాలని తెలిపారు. మంత్రులు, కలెక్టర్లు పాల్గొనే అధికారిక కార్యక్రమాల్లో మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణానికి మెట్టు ... ఇంటికో చెట్టు అనే నినాదంతో విరివిగా మొక్కలు నాటాలని స్పష్టం చేశారు. విద్యుత్తు తీగల క్రింద పెద్ద చెట్లు నాటోద్దని, పెద్దవి కాగానే కొట్టాల్సి వస్తుందని తక్కువ ఎత్తు పెరిగే మొక్కలు వేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అందుకు షెడ్యూల్ తయారు చేయాలని అధికారులకు సూచించారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో సమావేశం నిర్వహించారు..ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుండి అన్ని మండలాలలో రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని, విచారణలో పెండింగ్ ఉన్న దరఖాస్తులు క్లియర్ చేయాలని ఆదేశించారు. మహిళల ఉచిత బస్సు పథకంపై బస్ డిపోలో వేడుకలు చేయాలని అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భూ మాత దరఖాస్తులు విచారణలో వేగం పెంచాలని ప్రభుత్వ మార్గ దర్శకాలను పాటించాలని సూచించారు.
ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్డీఓ బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్మెయిల్ పాల్పడుతున్న

## నకిలీ విలేఖరి పై చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు చేసిన కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు





**భూపాలపల్లి/జూలై22(జర్నలిస్ట్ వార్త):** యూట్యూబ్ ఛానల్ పేరుతో ప్రజలను ,అధికారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతూ జర్నలిజం వృత్తికే విలువ లేకుండా చేస్తున్న రిపోర్టర్ అని చెప్పుకుని తిరిగే వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి కాకతీయ క్లబ్ జర్నలిస్టులు కోరారు. మంగళవారం ప్రెస్ క్లబ్ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ను వేరు వేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో నివాసము ఉంటూ యూట్యూబ్ ఛానల్, పత్రిక పేరుతో ఇష్టారాజ్యంగా చలామణి అవుతు మరో పత్రికలో (న్యూస్ భూమ్) అక్రిడేషన్ కార్డు పొంది (కార్డు నం జెఎస్ బీడీ 03) పని చేస్తున్నట్లు ఫిర్యాదులు చేశారు.తాను నడిపిస్తున్న యూట్యూబ్ చానెల్ కు అనుమతులు, హక్కులు లేవనీ ఫిర్యాదులో తెలిపారు సమాజంలో తాను జర్నలిస్టునని చెబుతూ బ్లాక్మెయిల్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. సదరు నకిలీ విలేకరి పైన పెద్దపెల్లి, భూపాలపల్లి, హుజురాబాద్ పోలీస్ స్టేషన్లో పలు కేసులు నమోదు తో పాటు భూపాలపల్లిలో రౌడీషీట్ కేసు ఉందని తెలిపారు. ప్రజలను అధికారులను బెదిరింపులకు పాల్పడుతూ జర్నలిస్టుగా చెలమని అవుతున్న నకిలీ విలేకరి అక్రిడేషన్ కార్డును రద్దు చేయాలని, ఆయనపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ప్రెస్ క్లబ్ కు చెందిన 80 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటి లో సీటు సాధించిన

## మర్రి రక్షితకు శ్రీనివాస్ రెడ్డి చేయూత




**రాయపర్తి/జులై22(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని మర్రి రక్షిత ఇటీవల ట్రిపుల్ ఐటి బాసరలో సీట్ సాధించింది.మంగళవారం విద్యార్థిని రక్షిత ను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి చేయుతనిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్ట పడి కాకుండా ఇష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు చేరాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్,ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, లేతాకుల మధుకర్ రెడ్డి, పెరటి యాదవ రెడ్డి,మాజీ సర్పంచ్ గారే నర్సయ్య,మాజీ ఎంపీటీసీ ఐత రా%శీ%చందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు ముద్రబోయిన సుధాకర్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రాము,ఫౌండేషన్ ప్రతినిధులు గజావెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్,కుందూరు యాదగిరి రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, పోగులకొండ వేణు, చిలువేరు సాయి గౌడ్, ఐత రాజు, ఉబ్బని సింహాద్రి, పెద్దగోని జీవన్, చందు లక్ష్మన్, ఐత రవి, ఎండీ యకూబ్, ఐత జంపి, గుండె రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

## - మండల విద్యాధికారి శ్రీనివాస్



**రాయపర్తి/జులై 22(జర్నలిస్ట్ వార్త):** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల విద్యాధికారి వి శ్రీనివాస్ అన్నారు.మంగళవారం మండలంలోని ఊకల్ గ్రామంలోని జిల్లా పరిషత్,ప్రాథమిక పాఠశాల లో నిర్వహించిన వన మహోత్సవంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాబురావు, సిఆర్పి రాజు,ఉపాధ్యాయులు జగదీశ్వర్,అనిత, శిరీష ,సంకూరి రాజు,సంధ్య,స్వర్ణలత,రామ్మూర్తి,సురేష్, విజయ,గ్రామస్తులు సదా శ్రీనివాస్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలవని మృతదేహానికి పోస్టుమార్టం



**గణపురం/జూలై22(జర్నలిస్ట్ వార్త):** భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గణపురం మండల కేంద్రానికి చెందిన ఇద్దరూ మత్స్యకారులు చేపల వేట కోసం ఘనపసముద్రంలోకి వెళ్తున్న క్రమంలో గణపురం చెరువు కట్టమీద హనుమాన్ దేవాలయమునికి సమీపంలో చెట్ల పొదలలో గుర్తుతెలియని ఏ సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి ఐదున్నర ఫీట్ల ఎత్తుతో ఒక మగ మృతదేహం కనిపించడం జరిగినది వెంటనే వారు పోలీస్ వారికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న ఘనపురం పోలీసులు చుట్టుపక్కలలో మృతదేహానికి సంబంధించిన ఆడవాళ్ళ కోసం వెతకడం జరిగినది అదేవిధంగా గణపురం గ్రామపంచాయతీ సిబ్బందితో ఫిర్యాదు తీసుకొని నిన్న రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది ఇట్టి మృతదేహం బాగా కుళ్ళిపోయి ఉన్నందున మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ కి తరలించడానికి అవకాశం లేనందున ఈరోజు ఉదయం భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారులను మృతదేహం లభ్యమైన ప్రదేశమునకు పిలిపించి పోస్టుమార్టం నిర్వహించడమైనది అని గణపురం ఎస్ఐ రేఖ అశోక్ తెలిపారు.

# సెయింట్ మేరీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో



రాయపర్తి/జులై 22(జర్నలిస్ట్ వార్త):మండలంలోని సెయింట్ మేరి పాఠశాలను జెడ్పీ సీఈవో రాంరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను పరిశించారు.ఉపాధ్యాయుల విద్యా అర్హతలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల ఫీజ్ ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల స్థితి గతులను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్నంపల్లి శ్రీనివాస్,అధికారులు తదితరులు ఉన్నారు.

# హుజురాబాద్ గడ్డ కేసీఆర్ అడ్డా.

## హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్ /జూలై 22: (జర్నలిస్ట్ వార్త):** ఈటల రాజేందర్ పెద్ద మోసగాడని టికెట్ ఇచ్చి అన్నం పెట్టిన కేసీఆర్ తో పాటు హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలను నమ్ముకున్న కార్యకర్తలతో పాటు ను కూడా మోసం చేశాడని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ధ్వజమెత్తాడు. మంగళవారం హుజురాబాద్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈటల రాజేందర్ ది కేసీఆర్ ను విమర్శించే స్థాయి కాదని, కెసిఆర్ పెట్టిన భిక్షతో పదవులు పొంది ఇప్పుడు కేసీఆర్ ని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. ఈటలకు రాజకీయ భిక్ష పెట్టి 2 సార్లు మంత్రిగా చేసిన కేసీఆర్ విమర్శించడం అంటే తిన్నింటి వాసాలు లెక్కబెట్టడమే అవుతుందని అన్నారు. దేవుడు లాంటి కేసీఆర్ను విమర్శిస్తే పుట్టగతులు ఉండవని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం లో ఉన్నప్పుడు లేని బీసీల మీద ప్రేమ ఇప్పుడు కొత్తగా ఎలా పుట్టిందని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీలో ఉండి పార్టీకే వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి కావాలనుకున్న నీ ఆశలను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తిప్పి కొట్టారని అన్నారు. పేద ప్రజల నెత్తుటి రక్తాన్ని పీల్చి వందల ఎకరాలు కబ్జా చేస్తే దానిని సహించని కెసిఆర్ పార్టీ నుంచి బయటకు వెళ్ళగొట్టింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. కొడుకు బిడ్డ పేర్లు పక్కన రెడ్డి అని పెట్టుకున్న నీవు బీసీ ఎలా అయితావని ఆయన ప్రశ్నించారు. కమలాపూర్ లో ఉన్న ఈటెల బంధువులను ఏనాడైనా హైదరాబాద్కు తీసుకువెళ్లి కనీసం అన్నం పెట్టావా అంటూ ధ్వజమెత్తారు. ఈటల రాజేందర్ బిసి ముసుగులో ఉన్న దొర అని అన్నారు. గుడ్లు అమ్ముకునే స్థాయి నుంచి బంగారు గుడ్లు అమ్ముకునే స్థాయి నుంచి బంగారు గుడ్లు అమ్ముకొని వరకు ఎలా ఎదిగామని ఆయన అన్నారు. హుజురాబాద్ గడ్డ బిక్ష పెడితే షామీర్పేట్ గడ్డ నాది అని ఎలా అంటావాని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం లో నాటి టిఆర్ఎస్ కార్యకర్తలను మభ్యపెట్టి తన వెంట తిప్పుకొని ఇప్పుడు షామీర్పేట్ కి వెళ్లి వాళ్లను నట్టేట ముంచారని అన్నారు. ఈటెల వెంట వెళ్లిన టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధైర్య పడవద్దని టీఆర్ఎస్ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని, ఈటలను నమ్ముకొని మోసపోయిన వారంతా తిరిగివస్తే వారికి ఎప్పుడు ఆహ్వానం పలికేందుకు హుజురాబాద్ నియోజకవర్గం లో నేను సిద్ధంగా ఉంటానని అన్నారు. ఈటల రాజేందర్ బిఆర్ఎస్ కార్యకర్తల జోలికి వచ్చి ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఈటల రాజేందర్ పార్టీలో చేరక ముందే మా నాన్న సాయినాథ్ రెడ్డి, కెప్టెన్ లక్ష్మీ కాంతారావు హుజురాబాద్ నియోజకవర్గం లో అన్ని స్థానాలు గెలిపించాలని గుర్తు చేశారు. హుజురాబాద్ గడ్డ ఎప్పటికీ కెసిఆర్ అడ్డాగానే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గ్రామపంచాయతీ మున్సిపల్ అన్ని ఎన్నికలలో హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రతి పోటీలో టిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి తీరుతానని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తో వెళితే నన్ను బిజెపిలో కలుస్తానంటూ మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు. అలా అయితే ఇటీవల ఈటెల రాజేందర్ బట్టి విక్రమార్కతో ఒక ఫంక్షన్కు వెళ్లారని అక్కడ దిగిన ఫోటో తను అఫీషియల్ అకౌంట్లో పోస్ట్ చేశారని అలా అయితే ఈటల రాజేందర్ కూడా కాంగ్రెస్లో చేరుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. బండి సంజయ్ ట్రాప్ లో కౌశిక్ రెడ్డి పడ్డారని ఈటెల మాట్లాడుతున్నారని బండి సంజయ్ ట్రాప్ లో పడింది నేను కాదని ఈటలనేనని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం లోని కొన్ని గ్రామాలకు 25 వేల చొప్పున పంపించి తన ఇంటి ముందు ధర్నా చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టుమని 200 మంది కూడా వెళ్లలేదని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం ఈటెల రాజేందర్ ను ఎప్పుడో మర్చిపోయిందని, ఇక హుజురాబాద్ లో ఈటెల రాజేందర్ కి ఎలాంటి మద్దతు దొరకదని విషయాన్ని మర్చిపోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన ఘాటుగా స్పందించారు. హుజురాబాద్ నియోజకవర్గం లో దళిత బంధు రెండో విడత వెంటనే అమలు చేయాలని, సుమారు 40000 మంది ఇంద్ర మహిళ కోసం దరఖాస్తులు పెట్టుకున్నారని వారందరికీ వెంటనే ఇందిరమ్మ ఇల్లు కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను హుజురాబాద్ లో పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు వదిలిపెట్టేదే లేదని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బి ఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ రావు, ఎంపీపీలు రాణిసురేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కన్నురి సత్యనారాయణరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గందే రాధిక శ్రీనివాస్, రాజేశ్వరరావు తక్కలపల్లి, సంగేమ్ ఐలయ్య, రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్లను రక్షిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

## పంచాయతీ కార్యదర్శి మహేష్




**నర్సంపేట/జులై22(జర్నలిస్ట్ వార్త):** మొక్కలు నాటి భవిష్యత్తు కాలంలో వాతావరణ కాలుష్యా నివారణకు తోడ్పాటు అందించి భవిష్యత్తు కాలానికి నాంది కావాలని కమ్మ పెల్లి పంచాయితీ కార్యదర్శి మహేష్ పిలుపునిచ్చారు. నర్సంపేట మండలంలోని కమ్మ పెల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వనమోత్సవం సందర్భంగా పాఠశాల అవరణలో మొక్కలు నాటిన అనంతరం మహేష్ పాల్గొని మాట్లాడుతూ, చెట్లు మానవ మనగడను కాపాడుతాయి అన్నారు. పెరుగుతున్న కాలుష్యం నివారణకు ఎక్కువ సంఖ్యలో చెట్లు పెంచడంతో కాలుష్యం నివారణతో పాటు పంటలు పండుటకు వర్షమును ఇస్తాయన్నారు. అడుగంటిన నీటి జలాలకు, వనమోత్సవం తో, వర్షాలు పడి నీటి జలాలు పెరుగుతాయి అన్నారు.నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ కే సర్దార్ కారో బార్లు జన్ను శ్రీనివాస్,అంకుష్ ఉపాధ్యాయులు కొంగర కవిత బి. రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎంపికైన విద్యార్థులకు

# నియామక పత్రం అందజేయాలి

## ఏ బి ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బోట్ల నరేష్



**నర్సంపేట/జులై22(జర్నలిస్ట్ వార్త):** బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రం అందజేయాలని ఏ బి ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బోట్ల నరేష్ అన్నారు. మంగళవారం బోట్ల నరేష్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధిలో షెడ్యూల్ క్యాస్ట్, గిరిజన విద్యార్థులు గత నెలలో క్రితం జిల్లాలోని వివిధ ప్రవేట్ పాఠశాలలో, ఒకటో తరగతి, ఐదవ తరగతి,లో బెస్ట్, అవైలబుల్ స్కీం ద్వారా ఎంపికై విద్యార్థులకు నియామక పత్రం అందజేసి వారి విద్యాభివృద్ధికి కృషి చేయవలసిన అధికారులు గత , 15 రోజుల క్రితం, ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన చేసిన అనంతరం నియామక పత్రం అందించాల్సిందే అధికారులు గత 15 రోజులు నుండి విద్యార్థులకు పత్రాలు అందజేయకపోవడంతో ఎంపికైన విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎంపికైన షెడ్యూల్ క్యాస్ట్, గిరిజన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసి వారిని ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మమత కావ్య శ్రీ భవిత సుకన్య నవ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏడు సార్లు గెలిచింది నేను..

## మూడు సార్లు గెలిచినోడు ముఖ్యమంత్రి అయ్యాడు



**రాయపర్తి/జులై22(జర్నలిస్ట్ వార్త):** అబద్దాలు చెప్పకుండా నేను ఏడుసార్లు గెలిచి మంత్రి నీ అయితే,అబద్దాలు చెప్పి మూడుసార్లు గెలిచిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎద్దేవ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు పేరుతో బీసీలను ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్ట పడి పని చేయాలని కోరారు.పాలకుర్తి నియోజకవర్గం లో మెజారిటీ స్థానాలు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని దీమా వ్యక్తం చేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు.సాగునీరు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని అన్నారు. నీళ్ల కోసం పాదయాత్ర చేస్తుంటే కొంతమంది కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని,అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.రేవంత్ రెడ్డి పాలనతో ప్రజలందరూ విరక్తి చెందారని అన్నారు.బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ దూర దృష్టితో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు అందించామని అన్నారు. పార్టీలో కష్టపడ్డా ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు.అనంతరం మండలంలోని జింకురాం తండ గ్రామానికి కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ తాజా మాజీ ఎంపీటీసీ బానోత్ శ్వేతసుభాష్, బానోత్ కీమా,మాలత్ రవి,మాలోత్ బోజ్యా,మాలోత్ లక్ష్మన్ లు కాంగ్రెస్ పార్టీనీ వీడి మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ చేరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, మండల ఇన్చార్జ్ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ కొండూరు రామచంద్రారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,ఎస్సీ సెల్ అధ్యక్షుడు గారే నర్సయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి అక్బర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జాజు నాయక్,మాజి పిఎసిఎస్ చైర్మన్ బందెల బాలరాజు,కర్ర రవీందర్ రెడ్డి,లేతాకుల మధుకర్ రెడ్డి,తాల్లపల్లి సంతోష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# షీ టీం నూతన ఎస్సై కి సన్మానం




**నర్సంపేట/జూలై22(జర్నలిస్ట్ వార్త):** నర్సంపేటలో నూతనంగా ఏర్పాటైన షీ టీమ్ పోలీస్ స్టేషన్ లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన. ఎస్సై స్వాతి ని మంగళవారం బీసీ పవర్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వరంగంటి కవిత మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షులు అధికార ప్రతినిధి ఆబోతు రాజు యాదవ్, మచ్చిక రాజు గౌడ్ మాట్లాడుతూ నర్సంపేటలో ఉండబడిన ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కాలేజీలు, మెడికల్ కాలేజీ, నర్సంపేట ఎడ్యుకేషన్ కేంద్రంగా మారుతున్న సమయంలో మహిళలు విద్యార్థులు ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవడం కోసం, జిల్లా పోలీస్ శాఖ నర్సంపేటకు షీ టీం శాఖను కేటాయించినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసుకుంటూ ఈ యొక్క అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

# ఘనంగా దాశరథి జయంతి వేడుకలు



**పర్వతగిరి/జూలై22(జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పర్వతగిరి పాఠశాల లో దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి సందర్భంగా మంగళవారం ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పాక రమేష్ బాబు సభాధ్యక్షులు గా వ్యవహరించారు. దాశరధి కృష్ణమాచార్యులు ప్రాతస్మరణీయుడని, ఆయన బాటలో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దాశరధి ప్రసిద్ధి చెందిన గేయం ఆ చల్లని సముద్ర గర్భం పాటపై విద్యార్థిని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేత ఏడవ తరగతి విద్యార్థిని పావని కి ప్రధానోపాధ్యాయులు గారి ఆధ్వర్యంలో బహుమతి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు డా. మడత భాస్కర్ , బి .రేఖ తో పాటు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

# కస్తూరిబాలో ఘనంగా దాశరధి జయంతి వేడుకలు



**చెన్నారావుపేట/జూలై22(జర్నలిస్ట్ వార్త):** చెన్నారావుపేట మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం లో దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయురాలు మెట్టుపల్లి జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని తన పలుకులు వినిపించిన దాశరథి పై విద్యార్థినులు ఉపన్యాసాలు ఇచ్చారు. అలాగే వారు రాసిన పాటలకు నృత్యప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలకు ఆహార భద్రత రేషన్ కార్డు ఎంతో కీలకం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు.
- రేషన్ కార్డు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.
- ప్రతి పథకం మహిళల పేరునే అందిస్తున్నాం.
- వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి.
- ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ మంజూరు చేస్తాం.





**ఏటూరునాగారం/జులై22(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు అందించాలన్న ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నూతనంగా ఆహార భద్రత, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని, రేషన్ కార్డు పేద కుటుంబాలకు ఎంతో కీలకమని రాష్ట్ర పంచాయతిరాజ్, గ్రామీణ అభివృద్ధి, గామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి పథంలో భాగంగా ఎస్ఎస్ తాడ్వాయి, ఏటూర్ నాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండల కేంద్రాల్లో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలిసి మంత్రి సీతక్క ఆహార భద్రత నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంలలో కన్నాయిగూడెం. మండలంలో రైతు వేదిక ఆవరణలో ఆహార భద్రత, రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణి చేసిన మంత్రి సీతక్క మాట్లాడుతూ 2013 సంవత్సరంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రతి ఒక్కరికి కడుపునిండా తిండి పెట్టాలనే ఉద్దేశంతో ఆహార భద్రత చట్టం తీసుకురావడం జరిగిందని, గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వల్ల నిరుపేదలు కడుపునిండా తిండి తినలేక పోవడానికి గ్రహించి నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారని అన్నారు. మన రాష్ట్రంలో పండించిన సన్న వడ్లకు 5, వందల రూపాయల బోనస్ ఇవ్వడమే కాకుండా ఇక్కడ పండించిన సన్నబియ్యాన్ని ధనవంతుడు తింటున్న విధంగానే పేదలు తినాలన్న ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని పథకాలను మహిళల పేరున్నే అందిస్తున్నామని, వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎంతగానో అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. గతంలో ప్రైవేటు రంగాలలో రుణాలు పొందిన మహిళలు వడ్డీల పై వడ్డీలు కట్టి ఆర్థికంగా నష్టపోయారని, అలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి మహిళలకు రుణాలు ఇవ్వడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానీ నిరుపేదల ఆందోళన చెందవద్దని, దశలవారీగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వలంబం కోసం ఇప్పటికే ఆర్టీసీ బస్సులను అందజేయడంతో పాటు లోన్ బీమా పథకం, ప్రమాద బీమా పథకం ఏర్పాట్లు, కొత్త సంఘాల ప్రారంభం, స్త్రీ నిధి రుణాలు అందజేయడం, మైక్రో ఎంటర్ప్రైజెస్, పాడి గేదెల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, పౌల్ట్రీ మదర్ యూనిట్, సంచార చేపల విక్రయ కేంద్రం, వ్యవసాయ అనుబంధ జీవనోపాధి కల్పన కోసం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లో ఏర్పాటు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు తదితర కార్యక్రమాలను మహిళా సంఘాల చే నిర్వహించడం జరుగుతుందని వివరించారు. గతంలో ఎన్నడు లేని విధంగా మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిక్షతతో ఉందని మంత్రి సీతక్క తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ వంటి వివిధ వ్యాపారాలు చేయడం వల్ల నెలకు మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందనన్నారు. బ్యాంకులు నేడు మహిళా సంఘాలకు క్యూ కట్టి రుణాలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయల అందిస్తున్నా మనన్నారు. మహిళ సభ్యులు సాధారణంగా మరణిస్తే 2 లక్షల రూపాయల వరకు లోన్ బీమా అమలు అవుతుందని అన్నారు. 60 సంవత్సరాల నిండిన వారిని కూడా మహిళా సంఘాలలో చేర్చాలని, 15 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సంఘంలో ఉండేలా చూడాలని అన్నారు. మహిళా సంఘం సామాజిక భరోసాగా పని చేయాలని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. మహిళల చేతిలో డబ్బులు ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబం ఎదగడానికి దోహదపడుతుందని ప్రతి మహిళ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్పీ శివం ఉపాధ్యాయ, ఏటూరునాగారం, సిఐ శ్రీనివాస్, కన్నాయిగూడెం తహసీల్దార్ ఎస్డి సర్వర్, కన్నాయిగూడెం. మండలం ఇంచార్జి ఎంపిడివో సాజిదా భేగం, కన్నాయిగూడెం, ఎస్సై వెంకటేష్, కన్నాయిగూడెం, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గణేష్, పలు సంబంధిత శాఖల అధికారులు, కన్నాయిగూడెం మండలం కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు అప్సర్ పాషా, కాంగ్రేస్ పార్టీ కన్నాయిగూడెం మండల ఇంచార్జి జాడి రాంబాబు, మాజీ ఎంపిటిసి, లు సర్పంచ్ లు, మహిళాలు మండల కాంగ్రేస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ మైనర్ బాలుడు



**సత్తుపల్లి/జూలై22(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి లో టూ వీలర్ పై గంజాయి తరలిస్తున్న ఓ మైనర్ బాలుడు పట్టుబడ్డాడు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ ఏ.రఘు వివరాలు వెల్లడించారు. సత్తుపల్లి పట్టణ సీఐ టి శ్రీహరి, సత్తుపల్లి ఎస్సై పి ప్రదీప్ సిబ్బంది తో కలిసి పెట్రోలింగ్, వాహనాలు తనిఖీ చేస్తుండగా సత్తుపల్లి పట్టణం వేంసూర్ రోడ్డు ఫారెస్ట్ అర్బన్ పార్క్ సమీపంలో సత్తుపల్లి బస్ స్టాండ్ వైపు నుంచి ఓ మైనర్ బాలుడు మోటార్ సైకిల్ పై వస్తున్నాడు. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారి పోవుటకు ప్రయత్నించాడు. పోలీసులు బాలుడిని పట్టుకుని ఆపి విచారించగా అతను చెడు వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని గంజాయి కొనుక్కుని వచ్చి వాటిని చిన్న ప్యాకెట్లుగా చేసి ప్యాకెట్ రూ.500 లకు కావలసిన వారికి అమ్మేవాడు అని తెలిపారు. వచ్చిన డబ్బులు తన జల్సాలకు వాడుకుంటూ తన స్నేహితులతో కలిసి డబ్బులు లేనప్పుడు మోటార్ సైకిల్ దొంగతనాలు చేసి వాటిని అమ్మి వచ్చిన వాటితో ఒరిస్సా రాష్ట్రంలోని ఓ వ్యక్తి వద్దకు వెళ్లి గంజాయి కొనుక్కొని తీసుకొని వచ్చి పీల్చుతూ అమ్ముతూ జల్సా చేసేవాడు. అదే విధంగా సోమవారం సూర్యాపేట మధిర కు చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి గంజాయి కొనుగోలు చేయడానికి ఏలూరు, విజయవాడ, లో దొంగతనం చేసి మోటార్ సైకిల్ లను వేసుకొని ముగ్గురు కలిసి ఒరిస్సా రాష్ట్రంలోని ఒక వ్యక్తి వద్దకు వెళ్లి ఏడున్నర కేజీల గంజాయి కొనుగోలు చేశారు. విజయవాడలో దొంగతనం చేసిన మోటార్ సైకిల్ అతనికి ఇచ్చారు. మిగిలిన మోటార్ సైకిల్ లను ఏలూరు నుంచి తీసుకొచ్చిన ముగ్గురు కలిసి వస్తే పోలీసులు అనుమానం వస్తుందని సూర్యాపేట, మధిర కు చెందిన ఇద్దరు వ్యక్తులు సత్తుపల్లి కి బస్సులో రాగా బస్టాండ్లో వారు కనిపించకపోవడంతో ఇంటికి వేంసూర్ రోడ్డు వైపు కు వస్తున్నారు. పోలీసులు సత్తుపల్లి రోడ్ లో ఫారెస్ట్ అర్బన్ పార్క్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో వారిని చూసి పారిపోతుండగా పట్టుకొని అతని వద్ద నుంచి 7.560. గ్రాముల గంజాయి ఒక టూ వీలర్ స్వాధీన పరచుకొని సత్తుపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి, జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పరచినట్లు కల్లూరు ఏసీపీ ఏ రఘు విలేకరులకు తెలిపారు.


## ఎంఆర్ఒ,ఎస్ఐలను సన్మానించిన నవచైతన్య యూత్ కమిటీ సభ్యులు




**వేలేరు/జులై22(జర్నలిస్ట్ వార్త):** వేలేరు మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇటీవలే నూతనంగా నవచైతన్య యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మండల తహసిల్దార్ హెచ్ కోమి, ఎస్ ఐ ఎ సురేష్ లను మంగళవారం అధ్యక్షుడు:-కోడూరి శ్రీకర్, ఉపాధ్యక్షుడు:-సోంపెల్లి ప్రేమ్ కుమార్ లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు ఈ సందర్భంగా ఎంఆర్ ఒ కోమి,ఎస్ ఐ సురేష్ లు మాట్లాడుతూ నేటి యువత సమాజంలో ముఖ్య భూమిక పోషిస్తూ తన దైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొని ఆదర్శ వంత మైన జీవితాలను కొనసాగించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రధానకార్యదర్శి:-అక్కల ప్రశాంత్,కోశాధికారి:-గూడూరి పరమేష్,కార్యదర్శి:-కొయ్యాడ మహేష్,సహాయక కార్యదర్శి:-మోతె శివప్రసాద్,సలహాదారులు:-గూడూరి శ్రీనివాస్, మేక రాజు,కుల పెద్దలు:- సత్తిగారి శంకర్,మోతె రాజు,మోతె రవిసోంపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బిజెపి నాయకులు పనిచేయాలి

### భాజాపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయరామారావు



**ధర్మసాగర్/జూలై22(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి నాయకులు స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గుండె విజయరామరావు హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రివర్యులు బిజేపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయరామారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి అని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతం చేయాలని అందుకు స్థానిక నాయకులు అందరూ కలిసి పని చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పిదాల వల్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. బిఆర్ఎస్ అంతర్గత కుమ్ములాలతో సతమతమౌతుందని అన్నారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రజలు అందరి దృష్టి బిజేపి పై ఉందని కార్యకర్తలు అందరూ సమన్వయంతో కలిసి పని చేస్తే గెలుపు సులభమవుతుందని ఇందుకోసం ప్రతి కార్యకర్త, నాయకులు, బూత్ అధ్యక్షులు గ్రామాల వారిగా ఇంటింటికీ ప్రదాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అబివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేసి పార్టీకి అనుకూలంగా ఓటు వేసి బిజేపి అభ్యర్థులు గెలుపు సాదించేలా కృషి చేయాలని మార్గ నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు యుగెందర్, నిమ్మ సుదర్శన్ రెడ్డి, గంకిడి శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అమరెందర్ రెడ్డి, వీరన్న, శివ ప్రసాద్ రెడ్డి, సందీప్, శ్రీనివాస్ లతో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పర్వతగిరి/జూలై22(జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ లో నెటి మధ్యాహ్నం ఒంటిగంట నుండి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏ డీ ఈ తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ తో పాటు, నెక్కొండ లైన్ నుండి విద్యుత్ సరఫరా లో అంతరాయం కలిగిన యెడల రెడ్లవాడ ఫ్లీడర్ నుండి విద్యుత్తు వినియోగించుట కొరకు లైను పనులు నడుస్తున్నాయని, పర్వతగరి సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరుతున్నాము.

## కేజీబీవీ లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

**పర్వతగిరి/జూలై22(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంఎల్టి కోర్సులో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా మంగళవారంతెలిపారు. 10వ తరగతి లో పాస్ అయిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. అప్లై చేసుకునే విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో తేదీ 23-07-2025 బుధవారం రోజున నేరుగా పర్వతగిరి కస్తూరిబా గాంధీ పాఠశాలకు రావలసిందిగా ఆమె సూచించారు.

## విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

### - కన్నాయిగూడెం, పిహెచ్సి వైద్యాధికారి డా అభినవ్,



**కన్నాయిగూడెం/జులై22(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని కన్నాయిగూడెం, పిహెచ్సి వైద్యాధికారి డా అభినవ్ అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల పరిధిలోని రెండు ఆశ్రమ పాఠశాలల్లో వైద్యాధికారి డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరిగినది. 1, ఎహెచ్ఎస్ కన్నాయిగూడెం, 2, ఏయూపీఎస్ తుపాకులగూడెం. హాస్టల్ లల్లో జ్వర పీడితులపై ఆరా తీసి జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు ఆర్డీటీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి, ఇతర చిన్న చిన్న జబ్బులకు చికిత్స అందించారు, విద్యార్థులు వంట చేసే ప్రాంతాలు మరియు హాస్టళ్లను కూడా పరిశీలించి వంట చేసే ప్రదేశాలలో సురక్షితమైన మరియు పరిశుభ్రత విధానాలను నిర్వహించాలని ఆదేశించి వ్యాధి కారకం ద్వారా సంక్రమించే వ్యాధి జాగ్రత్తలు మరియు భద్రతా చర్యల గురించి మరియు సరైన చేతులు కడుక్కోవడానికి విద్యార్థులకు అవగాహన కల్పించామని వైద్యాధికారి డా అభినవ్ అన్నారు, ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుజాత, ఏహెచ్ఎస్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఎంసీహెచ్ స్టాఫ్ నర్సు మంజుల, ఏఎన్ఎంలు కవిత, సబిత, ఆశావర్కర్లు, ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.